www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 25 సెప్టెంబరు 2025
5
ఏలూరు

మళ్లీ పెరిగిన గోదావరి వరద

స్పిల్ వే నుంచి 5,52,343 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి బుధవారం సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతూ వస్తుంది. ప్రాజెక్ట్ స్పిల్ వే నుంచి 5,52,343 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ స్పిల్ వే ఎగువన 30.400 మీటర్లు దిగువన 21.170 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.800 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 20.750 మీటర్లు, ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.000 మీటర్లు నమోదైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.80 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 9.43 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

పిజిఆర్ఎస్‌లో పింఛన్ల గోల..!

'ఏలూరు నగరంలోని అరుంధతీపేటకు చెందిన గుండు పద్మావతికి 54 ఏళ్లు. భర్త చనిపోవడంతో వితంతు పెన్షన్ కోసం ఎదురుచూస్తోంది. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్‌కు వచ్చి పింఛన్ ఇప్పించాలని అధికారులకు విన్నవించుకుంది. ఆ దరఖాస్తును ఏలూరు కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. కొత్త పింఛన్లకు సంబంధించి మంజూరు లేకపోవడంతో ఆమెకు పింఛన్ ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది'.

'టి.నరసాపురం మండలం గంగినీడిపాలెంకి చెందిన రామినేని రాణి అనే మహిళ తన భర్త గతేడాది జనవరిలో మరణించారని, ఇప్పటి వరకూ వితంతు పింఛన్ రాలేదని పిజిఆర్ఎస్‌లో అధికారుల వద్దకొచ్చి మొరపెట్టుకుంది. ఈ దరఖాస్తును సంబంధిత మండల పరిషత్ అధికారులు చూడాలని అధికారులు అప్పగించారు. కొత్తగా పింఛన్ల మంజూరు జరగకపోవడంతో ఆమెకు పింఛన్ ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు'.



నడవలేని వృద్ధుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

కూటమి అధికారంలో కొచ్చి

15 నెలలు గడిచే

రెండు జిల్లాల్లో పింఛన్ల కోసం

వేలాది మంది ఎదురుచూపు

అర్జీలు ప్రతి సోమవారం

పిజిఆర్ఎస్‌కు క్యూ

నిర్లాగ్యుల గోడు పట్టించుకోని

చంద్రబాబు సర్కార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న పద్మావతి, రాణి మాత్రమే కాదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో పింఛన్ కోసం అభాగ్యులంతా క్యూ కడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నానావస్థలు పడుతూ ఏలూరు చేరుకుని పిజిఆర్ఎస్‌లో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పింఛన్ అందదం లేదని వితంతువులు, వికలాంగులు, వృద్ధులు ఇలా ఎంతోమంది అధికారుల వద్ద విలపిస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు వెయ్యి వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో దాదాపు 50 మంది వరకూ కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రెండు జిల్లాల్లో కొత్తగా పింఛన్ల కోసం ఎదురుచూసే వారి సంఖ్య దాదాపు 50 వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. అర్హతుండి వేలాది మంది పింఛన్ల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్ల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అర్హులకు పింఛన్లు ఎందుకు మంజూరు చేయడం లేదో అర్థం కావడం లేదు. అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచినా కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. వక్షవాతంతో మంచానికే పరిమితమైన ఎంతోమందికి పింఛన్ అందడం లేదు. దీంతో ఆలాంటి వారంతా వైద్య ఖర్చుల కోసం తల్లడిల్లిపోతున్నారు. సచివాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో తమగోడు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్‌కు జనం పెద్దఎత్తున వస్తున్నారు. పిజిఆర్ఎస్‌కు వస్తున్న ఫిర్యాదుల్లో పింఛన్ల కోసం వస్తున్న నిర్యాగ్యులే ఎక్కువగా ఉంటున్నారు. పింఛన్ల కోసం వస్తున్న ఫిర్యాదులను ఏదోక అధికారికి అప్పగిస్తూ పిజిఆర్ఎస్‌లో అధికారులు రాస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఇదంతా కంటితుడుపు చర్యగా మారిపోయింది. ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయకుండా వారికి పింఛన్ ఎవిధంగా వస్తుందో చెప్పాల్సి ఉంది.

పింఛన్ల సంఖ్య తగ్గించాకే కొత్త పింఛన్లు ఇస్తారా..?

ఉన్న పింఛన్ల సంఖ్యను తగ్గించిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే ఏలూరు జిల్లాలో 4,300 మంది వికలాంగులు, పశ్చిమలో 1817 మంది వికలాంగుల పింఛన్లను తొలగించేందుకు నోటీసులు జారీ చేశారు. వికలాంగులతోపాటు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన రావడంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. ఇప్పట్లో కొత్త పింఛన్లు ఇస్తుందో, లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బకాయి బిల్లులు, వేతనాలు ఇవ్వాలని

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు 3200 మంది పని చేస్తున్నారని, వీరికి గత మూడు నెలల నుంచి వేతన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీరికి ఇచ్చే వేతనం రూ.మూడు వేలు అని, అదీ నెలలు తరబడి పెండింగ్‌లో పెడితే కార్మికులు వండి పెట్టడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్మికుల కుటుంబాలు గడవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటున్నారు. ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులు అత్యధికులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలని, రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి అని తెలిపారు. ఇంటర్ కాలేజీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సంపూర్ణ పోషణకు పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే మంచి లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందని, పథకం లక్ష్యానికి తగ్గట్టుగా పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మహిళలు రోజుకు దాదాపు 7 నుండి 8 గంటలపాటు పని చేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.పది వేలు ఇవ్వాలని, గ్యాస్‌ను, గ్యాస్ సిలిండర్‌లు ప్రభుత్వమే ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ ఛార్జీలు రూ.20 పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వంట చేసేటప్పుడు అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, ఏలూరు నగర కార్యదర్శి ఇస్మాక్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, రమణారావు, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులను గాలికొదిలేశారు..!

కనీస ఏర్పాట్లు చేయని అధికారులు

ముురికి పట్టిన కార్పెట్లు గతి

గత్యంతరం లేని పరిస్థితుల్లో హోటల్స్‌కు, బంధువుల ఇంటికి అభ్యర్థులు

దిక్కుతోచని స్థితిలో 2,300 మంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిఎస్‌సి అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏలూరుకు తరలించిన అభ్యర్థులను అందరిని గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. పది స్కూల్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు అక్కడ కనీస వసతులు ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. అభ్యర్థులు, వారి వెంట వచ్చిన వారు ఏం చేయాలో దిక్కుతోచక రాత్రిపూట హోటల్‌కు, బంధువుల ఇళ్లకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్, జోన్-2 పోస్టులకు సంబంధించి మొత్తం 1146 మంది ఎంపికయ్యారు. వీరందరికీ 25వ తేదీ గురువారం అమరావతిలో సిఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందించే ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఏలూరు వచ్చి రిపోర్ట్ చేయాలని రాత్రికి అధికారులు ఏర్పాటు చేసిన స్కూల్స్‌లోనే ఉండాలని, అన్ని వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం సాయంత్రం ఏలూరు చేరుకున్న అభ్యర్థులకు కేటాయించిన స్కూల్స్ కనీస వసతులు లేకుండాపోయాయి. క్లాస్ రూమ్స్‌లో బెంచీల మధ్యలో మురికిపోయిన కార్పెట్లు వేసి అక్కడే పడుకోవాలని చెప్పిన పరిస్థితి నెలకొంది. దీంతో మహిళా అభ్యర్థులకు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. పాసులు ఇచ్చేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పెట్టారు. దీంతో మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్పెట్లపై ఎలా పడుకోవాలో తెలియక నరకయాతన అనుభవించారు. చాలామంది అందుబాటులో ఉన్న హోటల్స్‌లో రూములు తీసుకుని, మరి కొంతమంది బంధువుల ఇంటికి, కొంతమంది తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. మళ్లీ ఉదయం ఆరు గంటలకు రావాలని చెప్పడంతో నరకయాతన ఏంటన్న ఆవేదన వ్యక్తమైంది. దుప్పట్లు లేక పడుకునేందుకు సరైన చోటు లేక, వసతులు లేక నలిగిపోయిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు గురి చేస్తుందంటూ తీవ్ర అసహనం డిఎస్‌సి అభ్యర్థుల నుంచి వ్యక్తమైంది.

ఏలూరు సెంట్ తెరిసా స్కూల్లో రూమ్‌లో వేసిన కార్పెట్

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద స్కూల్ శానిటేషన్ వర్కర్ల ధర్నా

ధర్నా చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ శానిటేషన్ వర్కర్ల మూడు నెలల పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఎపి ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి. ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలను, పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుతూ భావిభారత పౌరుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న శానిటేషన్ వర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యారంగం అభివృద్ధి గురించి మాట్లాడే ప్రభుత్వ పెద్దలు రూ.6 వేలు వేతనం సకాలంలో ఇవ్వకపోవడం వారి చిత్తశుద్ధిలేమికి నిదర్శనమన్నారు. పాఠశాలల అభివృద్ధి, పిల్లల భవిష్యత్, వారి ఆరోగ్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ ఉన్నా శానిటేషన్ వర్కర్ల జీతాలను సక్రమంగా మొదటి వారంలోనే ఇవ్వాలని, కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శానిటేషన్ వర్కర్లకు రక్షణ పరికరాలు, షూస్, గ్లౌజెస్, యాప్రాన్స్, మాస్కులు, చీపుర్లు వంటివి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దసరా సెలవలలోపు జీతాలు ఇవ్వకుంటే సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు తీసుకుంటూ పేద మహిళా కార్మికులైన స్కూల్ శానిటేషన్ వర్కర్లకు జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ నుండి డిఇఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌషియా, విజయలక్ష్మి, పూజిత, బి నాగరాణి, ఆశాలత తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మృతి

ప్రజాసంఘాల నేతలు, సామాజికవేత్తల సంతాపం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్, ఏలూరు స్పోర్ట్స్

నూజివీడు పట్టణంలోని ప్రాంతీయ రవాణా కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.నాగమురళి అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన నాగ మురళి 2010లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి సాధించారు. ప్రస్తుతం ఆయన నూజివీడు రవాణా యూనిట్ కార్యాలయంలో కార్యాలయ ఇన్‌ఛార్జి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయినప్పటికీ ఆయన విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆయన విజయవాడ, గరికపాడు, ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, విజయవాడ జిల్లా ఉపరవాణా కమిషనర్ కార్యాలయలలో విధులు నిర్వహించారు. ఆయన అనారోగ్యంతో విజయవాడలోని ఆయుష్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి పలు ప్రజాసంఘాల నాయకులు, పలువురు సామాజికవేతలు సంతాపం తెలిపారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం కార్యాలయ సిబ్బంది ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగమురళికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఒక కుమారుడు విదేశాల్లో స్థిరపడగా, ఇద్దరు కుమారులు ప్రస్తుతం సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

నాగమురళి (ఫైల్‌ఫొటో)

సెలవుల్లో తరగతుల నిర్వహణ దుర్మార్గం

డిఇఒ స్పందించి చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దసరా సెలవుల్లో స్థానిక ఎన్ఆర్.పేటలోని నారాయణ జూనియర్ కాలేజీలో హైస్కూల్ తరగతులు నడుపుతున్న పరిస్థితుల్లో బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ నారాయణ విద్యాసంస్థలు సెలవుల్లో తరగతులు నడపటం దుర్మార్గమన్నారు. అంటే నారాయణ జూనియర్ కళాశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను గదుల్లో బంధించి స్కూల్ నడపడం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం దసరా సెలవులను 22వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ప్రకటించిందని, జిల్లాలో నారాయణ స్కూల్ ఇప్పటివరకు సెలవులు ఇవ్వలేదని, ఏలూరు ఎన్ఆర్.పేట మోర్ మార్కెట్ సందులో నారాయణ జూనియర్ కళాశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠశాల నడుపుతున్నారని, ఈ కాలేజీలో ఇదే మొదటిసారి కాదని, ఈ విషయంలో డిఇఒకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. రెండు నెలల క్రితం నారాయణ జూనియర్ కళాశాలలో హైస్కూల్ నడుపుతున్నారని ఎస్ఎఫ్ఐగా ఆందోళన కార్యక్రమం చేశామని, ఆర్ఐఒ మూడుసార్లు కళాశాలకు నోటీసు ఇచ్చారని, డిఇఒ ఒక్కసారి కూడా స్కూల్ వైపు చూడలేదని విమర్శించారు. ఇప్పుడైనా నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.శివాజీ, ఎం.జయంత్, వంశీ, మనోజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

జట్టుకు షూస్ అందిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి

ప్రజాశక్తి - పోలవరం

క్రీడలు మానసికోత్తేజాన్ని కలిగించి శరీరానికి ఆరోగ్యాన్ని అందిస్తాయని స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. అక్టోబర్ ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జెసాఫ్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరగనున్న జర్నలిస్టు క్రికెట్ పోటీలకు వెళ్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టును ఆమె అభినందించారు. చేగొండపల్లి గ్రామంలో కార్యాలయం వద్ద క్రికెట్ జట్టుకు బుధవారం స్పోర్ట్స్ షూస్‌ను అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రాష్ట్రంలో వారి సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జట్టు సారథి మొడియం ప్రసాద్, నాగేంద్ర, రామకృష్ణంరాజు, మురళి, హరికృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లను క్రమంగా తనిఖీ చేయాలి

డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో బుధవారం పిసి, పిఎన్‌డిటిపై డిఎసి సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ లింగనిర్ధారణ పరీక్ష నిషేధిత చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి ఆడబిడ్డ జన్మించడానికి, ఎదగడానికి, చదవడానికి సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఐఎంఎ, పోలీసు టీమ్‌లుగా ఏర్పడి డెకాయ్ ఆపరేషన్లను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ సమాజంలో బాధ్యతగా మెలగాలని, లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు వారి దృష్టికి వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆడపిల్లలు నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టి, అక్కడ వారికి అవగాహన కల్పించి బాలికలు నిష్పత్తిని పెంచాలన్నారు. సంతాన ఉత్పత్తి సాఫల్య కేంద్రాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, రికార్డులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. సమాజంలో ఆడ, మగ అంతరాలు తొలిగేందుకు సంబంధిత వైద్యాధికారులు ప్రజల్లో విస్తృత అవగాహన పెంచేలా నిరంతరం కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేష్

నిమ్మల కుమార్తె వివాహానికి విచ్చేసిన సిఎం, ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు సిఎం చంద్రబాబు దంపతులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. హెలీకాప్టర్‌లో పాలకొల్లు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్‌కు తొలుత మంత్రి నిమ్మల రామానాయుడు సాదరంగా ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధి బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఎ.షరీఫ్, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, మాజీ జెడ్‌పి ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె, అల్లుడికి చంద్రబాబు దంపతులు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. నిమ్మల కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హెలికాప్టర్‌లో విజయవాడ బయల్దేరి వెళ్లారు.

విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్

26, 27 తేదీల్లో భీమవరంలో

హాజరుకానున్న ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు ఐషే ఘోష్, పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి

రాష్ట్రవ్యాప్తంగా విచ్చేయనున్న 300 మంది విద్యార్థినులు, విద్యార్థి సంఘ నేతలు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, ప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మహిళా సాధికారత సాధన, వారి అభ్యున్నతి కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగానే ఎంతో చరిత్ర కలిగిన మన భీమవరంలో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రస్థాయి విద్యార్థినుల కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అంటూ విద్యార్థుల్లో దేశభక్తిని, సామాజిక చైతన్యాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తుందని, దీనిలో ఇప్పటికే 55 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. విద్యార్థినుల కన్వెన్షన్‌కు ఎస్ఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షురాలు, జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు ఐషే ఘోష్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 300 మంది విద్యార్థినులు, విద్యార్థి నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న శ్యామలరావు

బలివే ఆలయ అభివృద్ధికి కృషి

ఛైర్మన్‌గా బొమ్మకంటి శ్యామలరావు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా కాట్రేనిపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బొమ్మకంటి శ్యామలరావు ప్రమాణస్వీకారం ఆలయ కార్య నిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు కొలుసు నితిన్‌కృష్ణ హాజరయ్యారు. నూతన ఛైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, ఉత్సవాల కోసం తన వంతు కృషి చేస్తానని, సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. రానున్న శివరాత్రి ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, టిడిపి నాయకులు గరికిముక్కు నాని, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, తుమ్మల నాగేశ్వరరావు, కాట్రు రామస్వామి, గుడిపాటి అజయ్, సాంబయ్య, దేవినేని డలరామ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్మన్ అడపా నాగరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మాట్లాడుతున్న నాగరాజు

రైతుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్ పర్సన్ అడపా నాగరాజు తెలిపారు. స్థానిక సొసైటీ ఆవరణలో బుధవారం మహాజన సభ ఛైర్ పర్సన్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951లో సొసైటీ స్థాపించిన నాటి నుంచి దిన దినాభివృద్ధి చెందుతూ 75 వసంతాలు పూర్తి చేసుకుని ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. ప్రస్తుతం 2218 మంది సభ్యులతో రూ.2.97 కోట్ల షేర్ ధనం కలిగి ఉందని ఆయన తెలిపారు. సంఘ పరిధిలో నూతనంగా పెట్రోల్ బంకు, మినీ కళ్యాణ మండపం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జీరో వడ్డీ సంఘ సభ్యుల ఎకౌంట్‌లలో జమ చేసినట్లు ఆయన తెలిపారు. సంఘ బడ్జెట్‌ను సిఇఒ భుజంగరావు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్ దాసరి నాగ దుర్గారావు, ఎంపిటిసి ఆళ్ల బాలాజీ పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సొసైటీ అభివృద్ధికి కృషి

కె.జగ్గవరం సొసైటీ ఛైర్మన్ బొంతు సత్యనారాయణ

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రణాళికా బద్ధంగా సొసైటీ అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని కె.జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ బొంతు సత్యనారాయణ అన్నారు. స్థానిక సొసైటీ ఆవరణలో బుధవారం మహాజనసభ బొంతు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. కె.జగ్గవరం గ్రామంలో 250 ఎంఎం సొసైటీ గోడౌన్ మరమ్మతులు, అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో నూతనంగా గోడౌన్ వాటర్ ప్లాంట్ నిర్మాణం, గుడ్లపల్లి గ్రామంలో ఉన్న గోడౌన్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న సొసైటీ పెట్రోల్ బంకులో వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఆయిల్‌పామ్ రైతులకు సొసైటీ ద్వారా ఎకరానికి రూ.లక్ష చొప్పున ఒక్కొక్క రైతుకు గరిష్టంగా రూ.పది లక్షల వరకు రుణాలు అందించడానికి కృషి చేస్తానన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. సంఘ బడ్జెట్‌ను సిఇఒ తనగాల వీర వెంకయ్య ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట డిసిసిబి మేనేజర్ నాగేంద్రబాబు, పర్సన్ పొలిమెర వెంకటేశ్వరరావు, అగ్నిపర్తి భిక్షమయ్య, వెలిది గంగాధరరావు, బొంతు అంజిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్ఐగా ఆదిత్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా వి.ఆదిత్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారికి రూ.2,18,84,539 ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలు బుధవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 31 రోజులకు రూ.2,18,84,539 ఆదాయం వచ్చింది. యాత్రికుల కానుకల రూపేణ 120 గ్రాముల బంగారం, 4 కేజీల 079 గ్రాముల వెండి, పాత రూ.500 (16 నోట్లు), రూ.2000 (2 నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ ఇఒ మూర్తి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు, కేశఖండనశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సరిహద్దులో ఉచిత బస్సులు నడపాలి

ప్రజాశక్తి - చింతలపూడి

తెలంగాణ సరిహద్దులో ఉన్న వారికి కూడా ఉచిత బస్సు పథకం అమలు చేయాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అసెంబ్లీలో ప్రస్తావించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మహిళలు అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర సరిహద్దులో ఉన్న ప్రాంతాల వారికి వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ వెళ్లే బస్సులకు కూడా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు ఉచిత బస్సు అమలు చేయాలన్నారు.

పేదల ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

జంగారెడ్డిగూడెం :జంగారెడ్డిగూడెం మున్సిపల్ అధికారులు పేదల ప్రాంతాలపై చులకన భావం చూపుతున్నారని స్థాని కులు ఆవేదన చెందుతున్నారు. గత ఐదు నెలల క్రితం డాంగే నగర్ వడ్డెర పేట వద్ద పైపులైన్ మరమ్మతుల కోసం సీసీ రోడ్డు పక్కన మట్టిని తవ్వి రోడ్డుపై వేశారు. పైపులైన్ మరమ్మతుల అనంతరం తవ్విన మట్టిని గోతిలో వేయకుండా రోడ్డుపైనే వదిలేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో స్థానిక 27వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి ఈ సమస్యను లేవనెత్తారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై మట్టిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. కొంత మట్టిని మాత్రమే తొలగించి వదిలేశారు. అధికారుల వద్ద ఎన్నిసార్లు కౌన్సిలర్ మొరపెట్టుకున్నా ఉదాసీనంగా వ్యవహరించడం పేదల ప్రాంతాలపై మున్సిపల్ అధికారులు చూపుతున్న చులకన భావాన్ని వెల్లడి చేస్తుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అధికారుల తీరుపై ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ దృష్టి సారించి పేదల ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రవాణా శాఖ లక్ష్యాలను పూర్తి చేశాం

అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రవాణా శాఖ అర్ధ సంవత్సరపు లక్ష్యాలను వంద శాతం సాధించామని రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు రవాణా శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ఆయనతో ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లు, ఓనర్లకు సంబంధించిన ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలపండి?

అధికారి : ప్రస్తుతం ప్రభుత్వం తరపు నుంచి ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు యజమానులకు సంబంధించి రూ.15 వేలను ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైతే వాహన డ్రైవర్, యజమానిగా ఉంటారో వారే ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించారు. గత లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 2700 లబ్ధిదారులు ఉండగా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌లకు సంబంధించి 3700 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీటిపై ఎవరు అర్హులు, అనర్హులు అనే అంశాన్ని ప్రస్తుతం రవాణా శాఖ ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నాం.

ప్రశ్న : జిల్లాలో ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్‌లు ఎంతవరకు పూర్తయ్యాయి?

అధికారి : జిల్లాలో మొత్తం బస్సులు 1120 ఉండగా వాటిలో కాలం చెల్లిన బస్సులు 158 ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డుపై తిరిగే బస్సులన్నిటికి ఫిట్‌నెస్ పూర్తయింది.

ప్రశ్న : జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు ఎలా కొనసాగుతున్నాయి?

అధికారి : జిల్లాలో అర్ధ సంవత్సర టార్గెట్ రూ.4.25 కోట్లు ఉండగా వంద శాతం టార్గెట్‌ను రవాణా శాఖాధికారులు సాధించారు. వారు రూ.4.25 కోట్ల జరిమానాలను విధించారు. జిల్లా వ్యాప్తంగా ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఐదుగురు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాహన తనిఖీల్లో పాల్గొని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది అర్ధ సంవత్సరంలోనే వంద లక్ష్యాలను సాధించడం ఎంత సంతోషంగా ఉంది.

ప్రశ్న : కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై తనిఖీలు కొనసాగుతున్నాయా?

అధికారి : ఆర్థిక సంవత్సరంలో కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై మొత్తం 380 కేసులు నమోదు చేశాం. ప్రతి గురువారం కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్యాక్సులు లేని, ఇన్సూరెన్స్ లేని బస్సులను గుర్తించడం, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించడం వంటి వాటిపై కేసులు నమోదు చేశాం. ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ లక్ష్యాలను పూర్తి చేస్తున్నాం.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా ట్యాక్స్ పెండింగ్ వాహనాలు ఉన్నాయా?

అధికారి : త్రైమాసిక ట్యాక్సులు కట్టాల్సిన వాహనాల్లో మ్యాక్సీ ట్యాబ్లు లైట్ గూడ్స్ వెహికల్స్ మాత్రమే ఎక్కువగా ట్యాక్స్ పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపుగా ఇవి ఎనిమిది వేల వాహనాలు ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం ఈ వాహన యజమానులకు నోటీసులు జారీ చేశాం. ఫోన్ల ద్వారా సమాచారాన్ని అందిస్తున్నాం. వాహనాలకు వెంటనే ట్యాక్సులు చెల్లించకపోతే వాటిని సీజ్ చేస్తామని తెలిపాం.

ప్రశ్న : రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరాలు తెలపండి?

అధికారి : ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై రోడ్డు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. కైకలూరు, ఆగిరిపల్లి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

కంటి సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించాలి

ప్రజాశక్తి - ఏలూరు రూరల్(దెందులూరు)

కంటి సంబంధిత వ్యాధులను ముందస్తుగా గమనించి తగిన వైద్య చికిత్సలు చేయించుకోవాలని రవికిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ హేమలత అన్నారు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో స్థానిక కమిటీ హాలు వద్ద దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల కళ్ల కలకలు, కళ్ల మంటలు, దురదలు వంటి వాటిని గమనించి సంబంధిత వైద్యులను సంప్రదించాలన్నారు. నల్ల గుడ్డు సమస్య, కంటి వ్యాధులు, శుక్లాలకు వైద్య పరీక్షలు చేశారు. తొలుత రెటీనా పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందించారు. 142 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు మండల ప్రెసిడెంట్ నంబూరి నాగరాజు, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి జయమంగళ దొరబాబు, పార్టీ గ్రామ అధ్యక్షులు ఘంటసాల సుబ్రహ్మణ్యం, గుడివాకలంక గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు చెరువు కేటాయించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని రావులపర్రులో నీలయ్యకుంట చెరువును స్థానిక రజకులకు లీజుకు కేటాయించకపోవడంతో అటు పంచాయతీకి ఆదాయం రావడంలేదని, ఇటు కులవృత్తిదారులకు ఆర్థిక నష్టం వాటిల్లిందని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్లయ్య అన్నారు. బుధవారం ఆయన రావులపర్రును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 కుటుంబాలు రజక వృత్తిపై ఆధారపడ్డాయన్నారు. గ్రామంలో నీలయ్య కుంట చెరువు వేలం పాట నిర్వహించేందుకు లీజు నిర్ణయం కోసం డివిజనల్ పంచాయతీ అధికారులకు ప్రతిపాదనలు పంచాయతీ పాలకవర్గం పంపకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని చెప్పారు. లీజు దక్కకపోవడంతో చెరువుపై హక్కు కోల్పోయారని రజకులు ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లాలో ఇలాంటి చెరువులు అనేకం ఉన్నాయన్నారు. అప్సెట్ ప్రైస్ ప్రతిపాదనలు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నిర్ణయించి రజకులకు న్యాయం చేస్తామని సర్పంచి పైడి వెంకట రమణ, పంచాయతీ సిబ్బంది చెప్పారు. ఆయనతో పాటు పెద్దిరాజు, సత్యనారాయణ, చినలక్ష్మయ్య, ఓబలంక సూరయ్య ఉన్నారు.

జన సురక్ష పథకాలతో సామాన్యులకు భద్రత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జులై ఒకటో తేదీ నుంచి మూడు నెలల పాటు జరిగే జన సురక్ష అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం కెనరా బ్యాంకు వారి ఆధ్వర్యంలో మర్రిబంధం గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రమేష్‌బాబు, డివిజనల్ మేనేజర్లు మోహన్‌బాబు, సూర్య యాదవ్, బ్యాంకు మేనేజర్ మధుసూదన్, బ్రాంచ్ సిబ్బంది సిఎఫ్ఎల్ టీమ్, కస్టమర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ ధన్ యోజన అకౌంట్లు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ ఫ్రాడ్స్, రికెవైసీల ఆవశ్యకత గురించి వివరించారు. జానపద కళాకారులచే కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

టిడిపి నాయకురాలికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

కూటమి నాయకులకు అండగా ఉంటామని జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. టిడిపి సీనియర్ నాయకురాలు నాగేశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మధుబాబు మానవతా దృక్పథంతో నెలవారి మందుల ఖర్చుల కోసం జనసేన నాయకులు ఎజిఎస్.కుమార్, ఆకుల మధు వారిచే రూ.రెండు వేలు ఆర్థిక సాయం అందించారు. నాగేశ్వరమ్మ మధుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిరంజీవి, తదితరులు

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనం ఏలూరులో జిల్లా అధ్యక్షులు ఇ.రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ పెండింగ్ డిఎలను దసరా పండుగ సందర్భంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల ఏడో తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ తక్షణమే పిఆర్‌సి కమిషన్ నియామకం చేపట్టాలన్నారు. రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను వెంటనే రద్దు చేయాలని, దీనిపై సిఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఎస్ఎంఎస్ సంఘం అధ్యక్షులు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, గౌరవ అధ్యక్షులు గంధం రాంబాబు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ.రామ్మోహన్, జి.మోహన్, ఎం.రమేష్‌బాబు, కృష్ణమూర్తి, జి.రాజు, బి.నాగరాజు, నాయక్, డి.యేసురత్నం, జి.వెంకటరమణ, డి.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాసరావు, యు.ఫణికుమార్ పాల్గొన్నారు.

శారీరక, మానసిక బలానికి క్రీడలు తోడ్పాటు

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులో ఈ నెల 22, 23 తేదీల్లో కబడ్డీ, ఆర్చరీ, ఫెన్సింగ్ క్రీడా విభాగాలకు ఇంటర్ - కాలేజియేట్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, పాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.చిరంజీవి ప్రారంభించారు. క్రీడలు, విద్యార్థుల శారీరక, మానసిక బలానికి తోడ్పడతాయని, ఆర్‌జియుకెటి క్రీడాకారులను ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటుందని వారు తెలిపారు. ఇందులో ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ బాలుర విభాగంలో ఆర్‌జియుకెటి శ్రీకాకుళం జట్టు విజేతగా నిలువగా, రెండో స్థానంలో ఆర్‌జియుకెటి ఒంగోలు జట్టు బహుమతి పొందింది. కబడ్డీ బాలికల విభాగంలో ఆర్‌జియుకెటి శ్రీకాకుళం జట్టు విజేతగా నిలవగా రెండో స్థానంలో ఆర్‌కె వ్యాలీ జట్టు బహుమతి పొందింది. ఫెన్సింగ్, ఆర్చరీ పోటీల్లో ఆర్‌జియుకెటి నూజివీడు జట్టు విజేతగా నిలిచి బహుమతి సాధించింది. గెలిచిన క్రీడాకారులకు, క్రీడా జట్టులకు ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ డాక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్, పాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.చిరంజీవి బహుమతులు అందించారు. గెలిచిన క్రీడాకారులను, క్రీడా జట్టులను ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌ల వ్యాయామ అధ్యాపకులను వారు అభినందించారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌ల నుంచి కబడ్డీ, ఆర్చరీ, ఫెన్సింగ్ జట్టులను ఎంపిక చేశారు. వివిధ యూనివర్సిటీల్లో నిర్వహించే క్రీడాపోటీల్లో, కబడ్డీ జట్టు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీకి, ఆర్చరీ, ఫెన్సింగ్ జట్టులు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆర్‌జి యుకెటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని స్పోర్ట్స్ సెక్రటరీ, నూజివీడు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ శాఖాధిపతి సిహెచ్.సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ సూర్య, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.51 లక్షలు అపహరణ

మహిళను మోసగించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. వృద్ధ మహిళను డిజిటల్ అరెస్టు పేరుతో మోసం చేసి ఆమె వద్ద నుంచి రూ.51 లక్షలు అపహరించారు. ఈ ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఏలూరు ఆర్ఆర్.పేట ప్రాంతానికి చెందిన వృద్ధురాలు మేక రమాదేవి భర్తతో కలిసి జీవిస్తుంది. వీరి పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. రమాదేవి కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి మీ ఆధార్ నెంబర్‌పై సిమ్ కొనుగోలు చేసి అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం వీడియో కాల్‌లో ఎస్ఐ దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి తాను బెంగళూరుకు చెందిన పోలీసు అధికారినని, మీపై ముంబై ప్రాంతంలో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, వాటి ద్వారా నేరస్తులకు నగదు బదిలీ అయిందని, మీపై కేసులు నమోదయ్యాయని బెదిరింపులకు గురిచేశాడు. వాటికి సంబంధించిన నకిలీ పత్రాలను కూడా వాట్సాప్ ద్వారా ఆమెకు షేర్ చేశాడు. అంతటితో ఆగకుండా నకిలీ అరెస్టు పత్రాలను కూడా ఆమెకు పంపారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు ద్వారా అరెస్టు చేస్తున్నామని తెలిపారు. దీంతో రమాదేవి భయభ్రాంతులకు గురై వెంటనే ఆ కేసు నుంచి బయట పడేయమని వారిని కోరింది. అందుకు దఫాదఫాలుగా రూ.51 లక్షలు వారికి చెల్లించింది. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి బుధవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు :రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనతోపాటు ప్రజలకు మరింత మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని దెందులూరు గ్రామంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా నియమితులైన కమిటీ ఛైర్మన్ కలపాల శ్రీహరితో పాటు కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న పలువురిని ఎంఎల్ఎ పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పాలనతో పాటు అన్ని తరగతుల ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలను అందించడం కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద బడుగు బలహీన తరగతులకు అండగా నిలుస్తూ, ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన వైద్య సేవలందించనున్నట్లు చెప్పారు. మరోవైపు సిఎం సహాయ నిధి ద్వారా బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి వారికి అండగా నిలుస్తున్నామని, గ్రామీణ స్థాయిలో సైతం మెరుగైన వైద్య సేవలందించేలా మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - మండవల్లి

మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా, ఆనందంగా ఉంటుందని కూటమి నాయకులు నందకిషోర్ ఎన్‌కె.రాంబాబు అన్నారు. మండలంలోని పెరికేగూడెంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యం మహిళ ఆరోగ్యంపై ఆధారపడి ఉందన్నారు. మహిళ ఆరోగ్యంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం పిహెచ్‌సి వైద్యురాలు స్తుతి ఆధ్వర్యంలో సిబ్బంది కంటి, చెవి, ముక్కు, గొంతు, కేన్సర్, మధుమేహం రక్తపోటులకు సంబంధించిన పరీక్షలు 195 మందికి చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాదిన వెంకట కృష్ణారావు, ఉమామహేశ్వరరావు, శివ నాగాంజనేయులు, ఎఎన్ఎం యేసు ప్రేమ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మహిళలు స్వస్థ్ నారీ స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ కోరారు. బుధవారం నారాయణపురంలో మహిళలకు ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చేబ్రోలు పిహెచ్‌సి వైద్యుల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. పలువురు మహిళలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సర్పంచి దిడ్ల అలకనంద, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మాలతీరాణి, వైద్యాధికారి శ్రావణ్‌రెడ్డి, సిడిపిఒ సునీల్ రాజ్‌శేఖర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారదామణి, పిహెచ్‌సి పర్యవేక్షకురాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బయ్యన్నగూడెం పిహెచ్‌సి వైద్యులు రామానుజపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచి అడపా నాగలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం చేస్తున్న ఆరోగ్య పరీక్షలు ఎంతో ఉపయోగకరామని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సుంకర రాజేష్, సీనియర్ టిడిపి నాయకులు పరిమి రాంబాబు పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వం పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు టౌన్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చాట్ల పుల్లారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలను పెంచుతూ శాసన మండలిలో తీర్మానం చేయడం చాలా దుర్మార్గమన్నారు. కార్మికులకు ద్రోహం చేయడమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు పని గంటలు పెంచిందన్నారు. రాత్రి వేళల్లో మహిళలు పని చేయాలని చెప్పటం సిగ్గుచేటన్నారు. శాసనమండలిలో ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక 13 గంటల బిల్లును వెంటనే ఉప సంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచి, రాత్రి షిఫ్టులలో మహిళలతోనూ పని చేయించుకునేందుకు వీలుగా చట్టంలో సవరణలు చేశారన్నారు. రాత్రి షిఫ్టుల్లో మహిళలు భద్రత ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందన్నారు. రాత్రి వేళల్లో మహిళా భద్రత యాజమాన్యం ఎంతవరకు తీసుకోగలదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బలరాం, వరప్రసాద్, కామేశ్వరరావు, నారాయణ, శ్రీనివాసరావు, ఉపేంద్ర, వెంకటేశ్వరరావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ చేపట్టిన జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి బహుముఖంగా వ్యవహరించాల్సిన సందర్భంలో మానసిక ఒత్తిడి అనివార్యమైందని, ఈ ఒత్తిడి రుగ్మతగా మారకముందే మేలుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్లినికల్ సైకాలజిస్ట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని ఎదుర్కొవడానికి విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాలను తెలిపారు. మానసిక వైద్య నిపుణులు హన్నా కోమలి మాట్లాడుతూ మానసిక రుగ్మతలకు కారణాలను వివరించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయ కుమార్ సమన్వయం చేయగా సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 25వ తేదీ గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి ఫీడర్‌లో ఉన్న పాతచింతలపూడి ఏరియాలో, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి సత్యసాయి ఫీడర్, 11 కెవి తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

యిందుమూలముగా నా క్లయింటు అయిన తెలంగాణా రాష్ట్రం, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, సప్తగిరి ఎన్‌క్లేవ్, ప్లాట్ నెం.02 రు కాపురస్తులు ఎనిగళ్ళ శివరామకృష్ణ ప్రసాద్ గారు వారి తాతగారైన ఎనిగళ్ళ మాణిక్యాలరావు గారికి చెందిన క్రయ దస్తావేజు నెం.1004/1954రు దస్తావేజును చేవూరు నుండి గుడివాడ వెళుతున్నప్పుడు మార్గమధ్యములో పోయినది. కావున ఎవరికైననూ సదరు దస్తావేజు దొరికిన యెడల నాకు సమాచారం తెలియపరుచుచూ సదరు దస్తావేజుపై ఏవిధమైన లావాదేవీలు జరిపిన యెడల అట్టి వానిపై సివిల్ క్రిమినల్ చర్యలకు తీసుకొనబడును అనియూ అట్టి లావాదేవీలు చెల్లనేరవని తెలియపరచడమైనది.

జె.రవిబాబు, అడ్వకేట్,
కైకలూరు. సెల్: 6300110571

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ ప॥గో॥జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No. 192/2025 (Old E.P.No. 113/2024 in O.S.No. 45/2019

Between:

చిలుకల ధనలక్ష్మీ దేవి ...డిక్రీహోల్డర్

మరియు

యర్లపాటి ఇస్సాక్ నిర్మలబాబు ...జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు దాఖలా వారంటు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారు **ది. 13-10-2025 సం॥ తేది ఉదయం గం. 10-30 ని.లకు** బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వాది/డిక్రి హోల్డర్ తరపు దాఖలు చేసిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థి వివరము.

పశ్చిమగోదావరి జిల్లా (ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా) అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాఖా, నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామ పంచాయితీలో ఆర్.యస్.నెం. 639/3B లో దక్షిణం వైపు ఉన్న య. 3-17 సెంట్లులో య. 1.58 సెంట్లు RCC బిల్డింగ్‌తో కలిపి జడ్జిమెంట్ డెటరు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చార్జీ కాబడి వేలం కావలిసియున్న ఆస్తికి హద్దులు:

తూర్పు - Land of Mullapudi Hari Chandra Rao
దక్షిణం - Land of Cherukuri Avatharam and others
పడమర - Devulapalli Road
ఉత్తరం - Land of Ghanta Ankalu and others

అమీనా కిమ్మత్తు : Rs. 35,00,000/-
డిక్రీహోల్డర్ కిమ్మత్తు : Rs. 50,00,000/-

ఇబ్రహీం షరీఫ్
ఏలూరు — అడ్వకేట్, ఏలూరు
ది.22-09-2025 — సెల్: 92900 49530